# ఎక్కడ.. ఎలా!

## విదేశాల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాల నిబంధనలివీ..

విదేశాల్లో చదువుల కోసం వెళ్లే విద్యార్థులు.. అక్కడ కనీస ఖర్చుల కోసం పార్ట్‌టైమ్ ఉద్యోగాల మీద ఆధారపడుతున్న సందర్భాలు చాలా ఉంటున్నాయి. అయితే రకరకాల కారణాలతో గతంలో కంటే ఇప్పుడు వీటి లభ్యత తగ్గిపోయిందని చెప్పొచ్చు. వెళ్లే ముందు ఏ దేశంలో ఎలాంటి పరిస్థితి ఉందో తెలుసుకుంటే విద్యార్థులు ప్రణాళికను సిద్ధం చేసుకోవడం సులభం అవుతుంది!



### అమెరికా

యూఎస్‌సీఐఎస్ నిబంధనల ప్రకారం.. ఇతర దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆఫ్ క్యాంపస్‌లో పని చేయడానికి కుదరదు. కానీ ఆన్ క్యాంపస్‌లో వారానికి 20 గంటల వరకూ పనిచేయొచ్చు. ఇందుకు కింది నిబంధనలు పాటించాలి.

» ఏదైనా యూనివర్సిటీలో ఫుల్‌టైమ్ విద్యార్థిగా చేరాలి. » ఎఫ్ 1 స్టేటస్ మనుగడలో ఉండాలి.

» కాలేజీ జరుగుతున్న రోజుల్లో వారానికి 20 గంటలు మాత్రమే పనిచేయవచ్చు.. సెలవు రోజుల్లో ఫుల్‌టైమ్ చేయవచ్చు.

» యూనివర్సిటీలో ఉన్న ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఆఫీస్ వద్ద వర్క్ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

**చదువు పూర్తయిన తర్వాత..:** సీపీటీ లేదా ఓపీటీ రూపంలో యూఎస్‌సీఐఎస్ అనుమతి తీసుకున్న తర్వాత ఆఫ్ క్యాంపస్‌లో పూర్తిస్థాయిలో పనిచేయవచ్చు. సీపీటీ (కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రెయినింగ్), ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్) ద్వారా వారానికి 40 గంటలు పని చేసే వీలుంది. ఇందుకూ నిబంధనలు ఉన్నాయి.

» స్టూడెంట్ మేజర్ సబ్జెక్టుకు చేసే పని నేరుగా సంబంధించింది అయ్యుండాలి.

» ఎఫ్ 1 స్టేటస్‌ను చట్టబద్ధంగా కలిగి ఉండాలి. » డిగ్రీ సంబంధిత పని మొత్తం పూర్తయ్యాకే విద్యార్థి ఓపీటీకి దరఖాస్తు చేయాలి.

» 12 నెలల వ్యవధి కంటే ఎక్కువ సీపీటీలో ఉన్న విద్యార్థులు ఓపీటీకి అనర్హులు. » స్టెమ్ సంబంధిత కోర్సులు చేసిన విద్యార్థులకు.. ఓపీటీ 12 నెలల కాలానికి ఇస్తారు. పొడిగింపు కోసం కాల వ్యవధి ముగియక ముందే దరఖాస్తు చేయాలి. దీన్ని గరిష్ఠంగా 24 నెలలకు పొందవచ్చు.

» ఈ మొత్తం కాలంలో ప్రతి 3 నెలలకు ఒకసారి విద్యార్థి తన గురించి యూనివర్సిటీకి సమాచారం తెలియజేస్తూ ఉండాలి.

### ఆస్ట్రేలియా

జులై 1, 2023 నుంచి.. ఇక్కడ చదువుకునే అంతర్జాతీయ విద్యార్థులు రెండు వారాలకు 48 గంటల పాటు పనిచేసే వీలుంది. సెమిస్టర్ బ్రేక్‌లో అన్‌లిమిటెడ్ గంటలు పని చేయొచ్చు.

➤ కోర్సు మొదలుకాకుండా పని మొదలు పెట్టకూడదు.

➤ చదువుతున్న కోర్సు కరిక్యులమ్‌లో పని కూడా భాగం అయితే అవి 48 గంటల లెక్కలోకి రావు.

**పని తర్వాత :** చదువు పూర్తయ్యాక ఆస్ట్రేలియాలో ఉండాలంటే.. కింది నిబంధనలు పాటించాలి.

➤ ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ (ఆనర్స్‌తో సహా) పూర్తి చేస్తే గరిష్ఠంగా రెండేళ్లకు వర్క్ పర్మిట్ దొరుకుతుంది.

➤ మాస్టర్స్ చేయడం ద్వారా మూడేళ్ల వరకూ పర్మిట్ పొందొచ్చు.

➤ డాక్టోరియల్ డిగ్రీ ద్వారా నాలుగేళ్ల వరకూ వర్క్ పర్మిట్ పొందే వీలుంటుంది.

➤ రీజనల్ ఆస్ట్రేలియన్ లొకేషన్స్‌లో చదివేవారు అదనంగా మరో 1, 2 ఏళ్ల వర్క్ పర్మిట్ పొందవచ్చు.

### జర్మనీ

ఒక ఏడాదిలో 140 పూర్తి రోజులు లేదా 280 సగం రోజులు మాత్రమే పని చేయవచ్చు. (పూర్తి రోజంటే 8 గంటలు, సగమంటే 4 గంటలు.)

▲ స్వయం ఉపాధి లేదా ఫ్రీలాన్సింగ్ చేసేందుకు వీలు లేదు.

▲ అనుమతించిన గంటల కంటే ఎక్కువ పని చేయాలి అనుకుంటే స్థానిక ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ, ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో అనుమతి తీసుకోవాలి.

▲ లాంగ్వేజ్ - ప్రిపరేటరీ కోర్సులు చేసేవారు.. ఫెడరల్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ, ఇమిగ్రేషన్ ఆఫీసు నుంచి కచ్చితంగా అనుమతి తీసుకోవాలి.

**చదువు పూర్తయ్యాక.. :** డిగ్రీ అందుకున్నాక అనుమతి తీసుకుని గరిష్ఠంగా 18 నెలల వరకూ రెసిడెన్స్ పర్మిట్ పొడిగించుకోవచ్చు.

▲ ఆ 18 నెలల గడువు చివరి పరీక్షలు పూర్తికాగానే మొదలవుతుంది. అందువల్ల యూనివర్సిటీలో ఉన్నప్పుడే ఉద్యోగం వెతుక్కోవడానికి ప్రయత్నించడం మంచిది.

▲ ఈ సమయంలో నచ్చిన ఉద్యోగం చేయవచ్చు. చదివిన సబ్జెక్టుతో అనుసంధానం కావాలనే నిబంధన లేదు.

▲ మెచ్చిన కొలువు దక్కాక.. కనీసం ఏడాది కాంట్రాక్ట్‌తో ఈయూ బ్లూకార్డ్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

### కెనడా

గతంలో ఇక్కడికి విదేశాల నుంచి వచ్చిన విద్యార్థులు వర్క్ పర్మిట్ లేకుండా ఆఫ్ క్యాంపస్‌లో వారానికి 20 గంటల వరకూ పనిచేసే వీలుండేది. దాన్ని ఐఆర్‌సీసీ తాజా నిబంధనల ప్రకారం.. 24 గంటలకు పెంచారు. ఇలా చేసేందుకు విద్యార్థులకు కొన్ని నిబంధనలున్నాయి.

➤ ఏదైనా డీఎల్ఐ (డిజిగ్నేటెడ్ లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్)లో ఫుల్‌టైమ్ స్టూడెంట్ అయివుండాలి.

➤ వొకేషనల్ లేదా ప్రొఫెషనల్ ట్రెయినింగ్- పోస్ట్ సెకండరీ అకడమిక్.. లేదా వొకేషనల్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ సెకండరీ లెవెల్‌లో చేరి ఉండాలి.

➤ ప్రోగ్రామ్ వ్యవధి కనీసం 6 నెలలు ఉంటూ.. పూర్తయిన తర్వాత డిగ్రీ, డిప్లొమా లేదా సర్టిఫికెట్ అందుకోవాలి.

➤ ప్రోగ్రామ్ మొదలైన తర్వాత మాత్రమే పనిచేయడానికి వీలుపడుతుంది.

➤ సోషల్ ఇన్స్యూరెన్స్ నంబర్ (ఎస్ఐఎన్) ఉండటం తప్పనిసరి.

వారానికి 24 గంటలు పనిచేయడంతోపాటు, ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు సైతం చేసే వీలుంది. స్టడీ పర్మిట్‌లో నిబంధనలు పాటిస్తూ ఇవన్నీ చేయవచ్చు. కాలేజీ విరామం ప్రకటించిన సమయంలో అన్‌లిమిటెడ్ పని గంటలు చేసుకోవచ్చు. చలికాలం, వేసవి సెలవులు, రీడింగ్ వీక్స్‌లో ఇది కుదురుతుంది.

**గమనిక :** 24 గంటల కంటే ఎక్కువ పనిచేయడం స్టడీ పర్మిట్ నిబంధనలను అతిక్రమించడమే అవుతుంది. ఇది నిరూపితమయితే ఆ దేశంలో మరోసారి చదువుకోవడానికి గానీ, పనిచేయడానికి గానీ అవకాశం లభించకపోవచ్చు. తీవ్ర చర్యల్లో దేశం విడిచి రావాల్సి ఉండొచ్చు.

**చదువు పూర్తయ్యాక..:** పట్టా పుచ్చుకున్న అనంతరం విద్యార్థులు పూర్తిస్థాయిలో పనిచేసేందుకు అనుమతి లభిస్తుంది. ఫిబ్రవరి 15, 2024 నుంచి.. రెండేళ్ల మాస్టర్ డిగ్రీ పూర్తి చేసినవారు.. గరిష్ఠంగా మూడేళ్ల పీజీడబ్ల్యూపీకి అర్హత సాధిస్తారు. దీని వ్యవధి పాస్‌పోర్ట్ గడువు మీద ఆధారపడి ఉంటుంది. 8 నెలల కంటే తక్కువ వ్యవధి గల కోర్సులు చేసిన విద్యార్థులు దీనికి అనర్హులు.

**ఇదే సర్టిఫికెట్, డిప్లొమా ప్రోగ్రామ్స్‌కు..**

➤ కోర్సు వ్యవధి 8 నెలల కంటే తక్కువ అయితే.. పీజీడబ్ల్యూపీకి అర్హత ఉండదు.

➤ కోర్సు వ్యవధి 8 నెలల నుంచి 2 ఏళ్లలోపు ఉంటే.. కోర్సు వ్యవధికి సమానంగా పీజీడబ్ల్యూపీ ఉంటుంది.

➤ రెండేళ్ల కంటే ఎక్కువ వ్యవధి గల కోర్సు అయితే.. పీజీడబ్ల్యూపీ మూడేళ్ల కాలానికి లభిస్తుంది.

### యూకే

టైర్-4 స్టూడెంట్ వీసా మీద వెళ్లే విద్యార్థులకు.. వారు పనిచేయదగిన నిబంధనలు ఏమిటో వీసా నిర్ణయ లేఖలో ఉంటుంది. వెళ్లేటప్పుడే వాటి గురించి వివరంగా తెలుసుకోవాలి. ఎంట్రీ క్లియరెన్స్ వీన్యెట్, బయోమెట్రిక్ రెసిడెన్స్ పర్మిట్ మీద వర్క్ పర్మిట్‌కు సంబంధించి మొత్తం వివరాలు ఉంటాయి.

▲ సాధారణంగా యూకేలో విదేశీ విద్యార్థులు వారానికి 20 గంటలు పనిచేసే వీలుంటుంది. సెలవుల్లో పూర్తిస్థాయిలో చేయవచ్చు. వీసా నిబంధనలు అనుసరించి ఆన్, ఆఫ్-క్యాంపస్‌లతోపాటు ఆన్‌లైన్ ఉద్యోగాలు చేసుకునే వీలుంది.

▲ ఒకే ఒక టెర్మ్ లేదా సెమిస్టర్‌కి ఎన్‌రోల్ చేసుకున్నప్పటికీ పనిచేసే వీలుంటుంది. అయితే ఇలాంటప్పుడు ఫుల్‌టైమ్ వర్క్ పర్మిట్ దొరకదు.

▲ సెలవుల సమయంలో గరిష్ఠంగా 40 గంటల వరకూ పనిచేసే వీలుంటుంది. ప్రాథమికస్థాయి కోర్సులు, భాషా సంబంధిత సబ్జెక్టులు చదివే విద్యార్థులకు 10 గంటల వరకూ మాత్రమే అనుమతి లభించవచ్చు.

▲ పార్ట్ టైమ్ కోర్సులు చేసే విద్యార్థులకు ఈ పనికి అనుమతి లేదు.

**పని తర్వాత:** చదువు పూర్తిచేసిన విద్యార్థులు గ్రాడ్యుయేట్ వీసాకు దరఖాస్తు చేసి ఫుల్‌టైమ్ పనిచేసే వీలుంటుంది. ఈ వీసా ద్వారా కనీసం రెండేళ్లు యూకేలో ఉండి పని చేయవచ్చు. దరఖాస్తు చేసినప్పుడు అక్కడే ఉండాలి.

▲ గ్రాడ్యుయేట్ వీసా రెండేళ్ల వరకూ మాత్రమే ఉంటుంది. పీహెచ్‌డీ లేదా ఇతర డాక్టోరియల్ క్వాలిఫికేషన్ ఉంటే అది మూడేళ్ల వరకు ఉండొచ్చు. అప్లికేషన్ అప్రూవ్ అయిన రోజు నుంచి వీసా గడువు మొదలవుతుంది.

▲ విద్యార్థి చేయదగిన, చేయకూడని ఉద్యోగాల గురించి వీసా నిర్ణయ లేఖలో వివరంగా ఉంటుంది. ఇది రావడానికి దాదాపు 8 వారాల సమయం పడుతుంది.



**శుభకర్ ఆలపాటి**
డైరెక్టర్, గ్లోబల్ ట్రీ